క్లుప్తంగా

గంగాపురంలో పశువైద్య శిబిరం



పశువులకు వైద్య సేవలందిస్తున్న పశు వైద్యాధికారి భోగి చక్రధర్

పార్వతీపురంటౌన్: మండల పరిధిలోని గంగాపురం గ్రామంలో బుధవారం ఉచిత పశు వైద్య శిబిరాన్ని నిర్వహించినట్లు పశు వైద్యాధికారి భోగి చక్రధర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాడి రైతులు లేగ దూడలకు క్రమం తప్పకుండా నట్టల నివారణ మందు తాగించాలని సూచించారు. ఈ శిబిరంలో 36 పాడిపశువులకు సాధారణ చికిత్స, 13 పశువులకు గర్భకోశ వ్యాధి చికిత్స, 11 పశువులకు గర్భ నిర్ధారణ పరీక్షలు, 228 పశువులు దూడలు గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందులు తాగించారు. ఈ శిబిరంలో పశు వైద్య ఆస్పత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జీడీ ప్రాసెసింగ్ యూనిట్లకు స్థలం పరిశీలన



స్థలం పరిశీలినలో ఐటీడీఏ పీఓ అశుతోష్ శ్రీవాస్తవ

పార్వతీపురంటౌన్: పార్వతీపురం పట్టణంలో జీడీపప్పు ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటుకు స్థలాన్ని ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి అశుతోష్ శ్రీవాస్తవ బుధవారం పరిశీలించారు. గిరిజన సంక్షేమ శాఖ ఆర్టికల్ 275(1) కింద కేంద్ర ప్రభుత్వం నిధులతో రెండు జీడిపప్పు ప్రాసెసింగ్ యూనిట్లు పార్వతీపురం సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థకు మంజూరు చేసిన సంగతి విదితమే. అందులో భాగంగా పార్వతీపురం వ్యవసాయ మార్కెట్ యార్డులోని గోదాముల్లో జీడిపప్పు ప్రాసెసింగ్ యూనిట్ల స్థాపనకు గల అనుకూల పరిస్థితులను పీఓ పరిశీలించారు. ఈ పర్యటనలో ఐటీడీఏ ఏపీఓ ఎ.మురళీధర్, డీఆర్డీఏ పథక సంచాలకుడు వై.సత్యంనాయుడు, జీసీసీ డీఎం, ఎ.డి మార్కెటింగ్, ట్రైబల్ వెల్ఫేర్ ఈఈ తదితరులు పాల్గొన్నారు.

108 సిబ్బందికి శిక్షణ



శిక్షణ అనంతరం 108 సిబ్బందికి సూచనలు ఇస్తున్న జిల్లా మేనేజర్ మన్మథ నాయుడు

పార్వతీపురంటౌన్: 108 వాహనంలో ప్రజలకు ఏ ఇబ్బంది కలగ కుండా సిబ్బందికి శిక్షణ అందజేసినట్లు జిల్లా మేనేజర్ మన్మథ నాయుడు తెలిపారు. ఈ మేరకు బుధవారం జిల్లా ఆస్పత్రిలో శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన సేవలు అందుబాటులోకి తీసుకువస్తున్నా మన్నారు. అపస్మారక, గుండె ఆగిపోయే పరిస్థితుల్లో ఉన్నవారికి సీపీఆర్ చేసి ప్రాణాపాయం నుంచి రక్షణ, మానవ శరీర అంతర నిర్మాణాలు విధివిధానాలపై అవగాహన కల్పించామని చెప్పారు. కార్యక్రమంలో గిరిబాబు, డివిజన్ నుంచి 40 మంది ఈఎంటీలు పాల్గొన్నారు.

పెన్షనర్లకు తక్షణమే లైఫ్ సర్టిఫికెట్లు

గుమ్మలక్ష్మీపురం: పెన్షనర్లకు తక్షణమే లైఫ్ సర్టిఫికెట్లు అందజేస్తున్నట్లు కురుపాం ఎస్‌టీఓ శంకరరావు పేర్కొన్నారు. ఈ మేరకు గుమ్మలక్ష్మీపురం వర్తక సంఘం భవనంలో మండల పెన్షనర్ల సంఘం ఆధ్వర్యంలో బుధవారం లైఫ్ సర్టిఫికెట్ల మంజూరు కోసం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ఈ డ్రైవ్‌లో గుమ్మలక్ష్మీపురం గ్రామంతో పాటు ఎల్విన్‌పేట, ఇరిడి గ్రామాలకు చెందిన వంద మందికి లైఫ్ సర్టిఫికెట్లను ఎస్‌టీఓ అందజేశారు. అలాగే మంచంపై నుంచి లేవలేని పెన్షనర్లు, వృద్ధులైన పెన్షనర్ల ఇంటి వద్దకే వెళ్లి లైఫ్ సర్టిఫికెట్లను అందజేశారు. ఎస్‌టీఓ సేవలను పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు హరిప్రసాద్, ప్రధాన కార్యదర్శి రఘో, చలపతి, నాగు, తిరుపతి తదితరులు కొనియాడి కృతజ్ఞతలు తెలిపారు.

ఎడ్ల బండికి తగ్గిన ఆదరణ



ఎడ్లబళ్లపై తరలిస్తున్న ఇసుక

- ఇసుక తరలింపులో ట్రాక్టర్ల వినియోగం
- జీవనోపాధి కోల్పోతున్న బళ్ల యజమానులు

బలిజిపేట:

గ్రామాల్లో ఎడ్లబళ్లపై ఆధారపడి పనిచేసుకునేవారికి ఆదరణ తగ్గుతోంది. కాలంతో పాటు యాంత్రీకరణ ఆవశ్యకత పెరగడంతో పల్లెల్లో ఎడ్ల బళ్లకు ఆదరణ తగ్గింది. పొలం పనుల్లో కూడా యాంత్రీకరణకు ప్రాధాన్యం ఇవ్వడంతో వారి జీవనోపాధి కష్టమవుతోంది. అయితే గత ప్రభుత్వంలో ఎడ్లబళ్లు ఉన్నవారు రాజులయ్యారు. ఇసుక తరలింపులో నాటుబళ్లతో ఇసుక తరలించేందుకు అనుమతులు ఉండడంతో యథేచ్ఛగా ఇసుకను తరలించుకునేవారు. దీంతో ఎవరికి ఇసుక కావాలన్నా నాటుబళ్ల యజమానులకు చెప్పేవారు. ఈ నేపథ్యంలో వారికి ఉపాధి లభించేది.

ప్రభుత్వం మారింది.. జీవనోపాధి పోయింది

గత ప్రభుత్వంలో ఎడ్లబండితో ఇసుక తరలించుకుని జీవనోపాధి మెరుగుపరుచుకున్నాం. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత ట్రాక్టర్లకు అనుమతులు ఇచ్చి మా పొట్ట కొట్టింది. జీవనోపాధి కష్టమవుతోంది.

– ఈశ్వరరావు, వెంగళరాయపురం, బలిజిపేట మండలం

గతంలో రోజుకు రూ.1000

గతంలో ఇసుక అక్రమ తరలింపును అధికారులు అడ్డుకునేవారు. ట్రాక్టర్లను సీజ్‌చేసేవారు. దీనివల్ల మండలంలోని ఎడ్లబళ్ల యజమానులకు జీవనోపాధి ఉండేది. వారి కుటుంబాలు ఏ ఇబ్బంది లేకుండా గడిచేవి. దగ్గర ప్రాంతాలకైతే ఒక విధంగా, దూర ప్రాంతాలకు తరలించాల్సి వస్తే మరో విధంగా డబ్బులు తీసుకునేవారు. కష్టపడి రోజుకు రూ.1000 సంపాదించేవారు. దీనిలో ఎడ్ల దాణాకు కొంత ఖర్చు అయినా మిగిలింది వారి కుటుంబ పోషణకు ఖర్చు పెట్టుకుని హాయిగా జీవించేవారు. ఇప్పుడు వారి జీవనోపాధి కష్టమవుతోంది.

కూటమి ప్రభుత్వంలో..

కూటమి ప్రభుత్వంలో ఉచిత ఇసుక విధానం అంటూ ట్రాక్టర్లు, ఎడ్లబళ్లపై ఇసుక తీసుకువెళ్లవచ్చని అనుమతులు ఇచ్చారు. ఇసుక అక్రమ వ్యాపారం జోరుగా సాగుతోంది. నదుల నుంచి ఇష్టారాజ్యంగా యంత్రాలతో తవ్వి తరలిస్తున్నారు. దీంతో ఎడ్లబళ్లపై తెచ్చే ఇసుకను తీసుకునేందుకు నిర్మాణాలు జరిపేవారు ఇష్టపడడం లేదు. ఎడ్లబళ్లకు ఆదరణ తగ్గింది. ఎడ్లబళ్లపై ఆధారపడి జీవనం సాగించే చాలా కుటుంబాలు రోడ్డున పడ్డాయి. కూటమి ప్రభుత్వం ఉపాధి తీసింది.

మోసపూరిత హామీలకు పెట్టింది పేరు చంద్రబాబు

- మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు



పార్వతీపురంటౌన్: మోసపూరిత హామీలకు పెట్టింది పేరు చంద్రబాబు నాయుడు పాలన అని మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. ఈ మేరకు పట్టణంలోని తన స్వగృహంలో బుధవారం ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మొన్న సచివాలయం సాక్షిగా హామీలను అమలు చేయలేమని చేతులు ఎత్తేసి మరోసారి రాష్ట్ర ప్రజలను నిలువునా మోసం చేయడానికి సిద్ధపడిన వైనాన్ని ఎండగట్టారు. ప్రజలకు అరచేతిలో వైకుంఠం చూపించి..ఎన్నికల హామీలతో కనికట్టు చేసి, మాయామర్మం చేశాడన్నారు. ఏ హామీలైతే ప్రజలకు ఇచ్చి అధికారంలోకి వచ్చారో నేడు ఆ హామీలను నెరవేర్చలేమని, పథకాలు ఇవ్వలేమని నిస్సిగ్గుగా ప్రకటించి ప్రజలను దగాచేశాడన్నారు. ప్రభుత్వం ఏర్పాటై దాదాపు 9 నెలలు కావొస్తోందని, ఈ 9 నెలలకాలంలో దాదాపుగా రూ.1.19 లక్షల కోట్లు అప్పులు తీసుకొచ్చారని మరి అప్పులతో ఎక్కడ సంపద సృష్టించారని ప్రశ్నించారు. ఒక్క ఉద్యోగం కూడా ఇవ్వకుండా ఉన్న ఉద్యోగాలను తీసేసి వారిని రోడ్డుమీదకు పెడుతున్నారన్నది నిజం కాదా అని ప్రశ్నించారు. పేదలకు న్యాయం చేయకపోతే నిరసనలు తెలిపేందుకు సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు.

పీహెచ్‌సీల సందర్శన



మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎస్. భాస్కరరావు

సీతానగరం: మండలంలోని రెండు పీహెచ్‌సీలను డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎస్. భాస్కరరావు బుధవారం సందర్శించారు. సీతానగరం, పెదంకలాం పీహెచ్‌సీల్లో ఉన్నమందులు, స్టాక్ రిజిస్టర్లు, రికార్డులు, ల్యాబ్‌లో వైద్యపరీక్షల వివరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా సీతానగరం పీహెచ్‌సీలో ఆయన మాట్లాడుతూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో 68 రకాల వ్యాధుల నివారణకు రక్త పరీక్షలు చేయనున్నట్లు చెప్పారు. అందుకు అవసరమైన పనిముట్లు అందుబాటులో ఉన్నాయని తెలియజేశారు. అలాగే గర్భిణుల్లో రక్తహీనత లేకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపడతామని ముందుగా గర్భిణులకు రక్తహీనత నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. సీతానగరంలో అసంపూర్తిగా ఉన్న పీహెచ్‌సీ భవన నిర్మాణాన్ని పరిశీలించారు. పీహెచ్‌సీ భవనం పనులు పూర్తి చేయడానికి ఉన్నతాధికారులద్వారా అవసరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు. అనంతరం పెదంకలాం పీహెచ్‌సీ భవనాలను పరిశీలించారు. కార్యక్రమంలో నోడల్ అధికారి వినోద్‌కుమార్, వైద్యాధికారులు ఉష, రాధాకాంత్, సీహెచ్‌ఓ ఎస్వీ రమణ,ఈఓ జి.సూర్యనారాయణ, వెంకటరావు, హెల్త్ సూపర్‌వైజర్లు సత్యవతి,వరలక్ష్మి, యూడీసీ మురళి, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులు సేవాభావం అలవర్చుకోవాలి

జియ్యమ్మవలస: విద్యార్థి దశ నుంచే ప్రతి ఒక్కరూ సేవాభావం అలవర్చుకోవాలని జిల్లా జూనియర్ కళాశాలల పరీక్షల ప్రత్యేకాధికారి వై.నాగేశ్వరరావు అన్నారు. మండలంలోని చిన మేరంగి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ సవరపు రమణ ఆధ్వర్యంలో ఫేర్‌వెల్ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఇందులో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు సేవాదృక్పథం కలిగి ఉండాలన్నారు. విద్యార్థులంతా ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకుని ముందుకు సాగాలన్నారు. ప్రిన్సిపాల్ రమణ మాట్లాడుతూ ఇంటర్‌లో మంచి మార్కులు సాధించి కళాశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలన్నారు. కురుపాం జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఉషారాణి, అధ్యాపకులు వీకేజీ మహారాణా, శివప్రసాద్, సతీష్, అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

మూగజీవాలకు వైద్యసేవలు



అనంతరాయుడుపేటలో అందిస్తున్న పశువైద్యసేవలు

సీతానగరం: మండలంలోని పలుగ్రామాల్లో బుధవారం నిర్వహించిన పశు ఆరోగ్య వైద్య శిబిరాలకు రైతులనుంచి మంచిస్పందన వస్తోందని సీతానగరం పశుసంవర్ధక శాఖ ఎ.డి డాక్టర్ సీహెచ్ దీనకుమార్, మండల పశువైద్యాధికారి డాక్టర్ ఎస్ రామారావు అన్నారు. ఈ మేరకు వారు మాట్లాడుతూ దయానిధిపురం, జానుమల్లువలస,ఏగోటివలస, అనంతరాయుడుపేట గ్రామాల్లో సిబ్బంది సహకారంతో నిర్వహించిన పశు ఆరోగ్య వైద్యశిబిరాల్లో 323 పశువులు, 2,436 గొర్రెలు, మేకలకు వైద్య పరీక్షలు నిర్వహించి వ్యాధి నిరోధక మందులు అందజేశామన్నారు. అలాగే ముందురోజు రాత్రిపూట కోళ్లకు వ్యాధినిరోధ మందులు ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రామీణ పశువైద్యాధికారులు, పారామెడికల్ సిబ్బంది, పశుసంవర్ధక శాఖ సహాయకులు, ఆయాగ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

మద్యం దుకాణానికి దరఖాస్తుల ఆహ్వానం



ఎక్సైజ్ సీఐ దాసు

సాలూరు: మండలంలో నూతనంగా మంజూరుచేసిన మద్యం దుకాణానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎక్సైజ్ సీఐ దాసు తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన పట్టణంలోని తన కార్యాలయంలో మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల మేరకు రోస్టర్ ప్రకారం గీత కార్మికుల్లో శ్రీశయన కులానికి చెందిన వారు మాత్రమే ఈ దుకాణానికి దరఖాస్తు చేసుకోవడానికి అర్హులని తెలిపారు. జిల్లాలో ఈ కులానికి చెందిన వారెవరైనా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. 2 లక్షల రుపాయల డీడీ లేదా చలానా, నాలుగు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు, ఆధార్, తహసీల్దార్ జారీచేసిన కుల ధ్రువీకరణ పత్రంతో పూర్తిచేసిన దరఖాస్తులను ఎక్సైజ్ కార్యాలయంలో వచ్చేనెల 5వ తేదీ సాయంత్రం 5 గంటలలోగా అందించాలని తెలిపారు.వచ్చే నెల 7వ తేదీన పార్వతీపురంలో కలెక్టర్ ఆధ్వర్యంలో లాటరీ ప్రక్రియ నిర్వహించనున్నట్లు చెప్పారు.

రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత విద్యార్థులదే



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

పార్వతీపురంటౌన్: రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత విద్యార్థులపై ఉందని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు కె.డేవిడ్ అన్నారు. ఈ మేరకు బుధవారం జిల్లా కేంద్రంలో గల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో రాజ్యాంగాన్ని కాపాడు కుందాం అనే నినాదంతో సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రం హక్కు కేంద్రం లాగేసిందని, ప్రాథమిక విద్యను కూడా కేంద్రం తన చేతుల్లోకి తీసుకుందన్నారు. ప్రాథమిక విద్యను ముక్కలు చేసిందని చెప్పారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి ప్రాథమిక పాఠశాలలు, మాధ్యమిక పాఠశాలలు మూసేయడానికి చంద్రబాబు ప్రభుత్వం సిద్ధమైందని, బీజేపీ కేంద్ర ప్రభుత్వ నేషనల్ విద్యా విధానంలో భాగమే ఈ కుట్ర అని అన్నారు. రాష్ట్రాలతో నిమిత్తం లేకుండా కేంద్రం ఏకపక్షంగా చేసిన నిర్ణయాలను రాష్ట్రం అమలు చేయడమే ఈ మార్పుల సారాంశమన్నారు. ఇది రాజ్యాంగ వ్యతిరేక చర్య అని, రాష్ట్రం హక్కును కేంద్రం లాగేసినా ప్రతిఘటించకపోగా అమలు చేయడం చంద్రబాబు బీజేపీతో కలిసి రాష్ట్రానికి ద్రోహం చేయడమేనన్నారు. కార్యక్రమంలో కవి జి.గౌరినాయుడు, అధ్యక్షులు టి.అఖిల్, ఎస్ఎఫ్ఐ మండల నాయకులు సాయి, శారద, రాజేష్, కవిత, సుకన్య పాఠశాల యాజమాన్యం తాతబాబు, రవి కుమార్ విద్యార్థులు పాల్గొన్నారు.

1/70 చట్టం జోలికి వస్తే సహించేది లేదు..



శాసనసభ స్పీకర్ అయ్యన్న పాత్రుడు వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తున్న గిరిజన సంఘాల నాయకులు

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): 1/70 చట్టం జోలికి వస్తే ఊరుకునేది లేదని ట్రైబల్ రైట్స్ ఫోరం అధ్యక్షుడు ఇంటికుప్పల రామకృష్ణ, గిరిజన అభ్యుదయ సంఘం జిల్లా అధ్యక్షుడు ఆరిక చంద్రశేఖర్ హెచ్చరించారు. కురుపాం మండల కేంద్రంలో ఆ సంఘాల నాయకులతో కలిసి 1/70 చట్టాన్ని సంరక్షించాలని బుధవారండిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విశాఖ వేదికగా నిర్వహించిన పెట్టుబడిదారుల సదస్సులో ఏపీ శాసనసభ స్పీకర్ అయ్యన పాత్రుడు 1/70 చట్టంపై సడలింపులు చేయాలని చేసిన వ్యాఖ్యలను తక్షణమే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. గిరిజనులకు గుండెలా కావలి ఉన్న 1/70 చట్టం సవరణ చేయాలని ఆలోచన చేయడం దుర్మార్గమని, ఆ ఆలోచనను వెనక్కి తీసుకోకుంటే గిరిజనులంతా ఏకమై ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. గిరిజనుల పట్ల చిత్తశుద్ధి ఉంటే సీఎం చంద్రబాబు ఎన్నికల ప్రచారంలో కురుపాంలో, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఎన్నికల ప్రచారంలో పాలకొండలో ఇచ్చిన వాగ్దానాల మేరకు తక్షణమే జీఓ నంబర్ 3ను పునరుద్ధరించాలని, షెడ్యూల్డ్ ప్రాంత గిరిజనుల కోసం ప్రత్యేక డీఎస్సీ నియామకాలు చేపట్టాలని హితవు పలికారు.

1/70 జోలికి రావద్దు

గుమ్మలక్ష్మీపురం: గిరిజన ప్రాంతంలో భూమిపై సర్వ హక్కులు స్థానిక గిరిజనులకే చెందుతుందని నిర్దేశించిన 1/70 చట్టం జోలికి ఎవరూ రావద్దని గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పాలక రంజిత్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. ఈ మేరకు స్పీకర్ అయ్యన్న పాత్రుడు 1/70 చట్టం సవరించాలంటూ చేసిన వ్యాఖ్యలపై రంజిత్ కుమార్‌పై విధంగా స్పందించారు.

ఫైలేరియా నివారణ మందు దగ్గరుండి మింగించాలి

- డీఎంహెచ్‌ఓ భాస్కరరావు



బలిజిపేట పీహెచ్‌సీలో ల్యాబ్ పరికరాలను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ భాస్కరరావు

బలిజిపేట: వచ్చేనెల 10వ తేదీన మండలంలో అందరికి ఫైలేరియా వ్యాధి నివారణ మాత్రలు దగ్గరుండి వారితో మింగించాలని డీఎంహెచ్‌ఓ భాస్కరరావు సూచించారు. బలిజిపేట పీహెచ్‌సీని ఆయన బుధవారం పరిశీలించి అనంతరం ఆశ కార్యకర్తలు, వైద్యాధికారులు, సిబ్బందికి శిక్షణ నిర్వహించారు. ఫైలేరియా నివారణకు అవసరమైన మందును ఏ విధంగా పంపిణీ చేయాలి, గ్రామ పెద్దలను సంప్రదించడం, ఎవరికి ఎంతెంత డోస్ పంపిణీ చేయాలి, వారి చేతికి మందు ఇవ్వకుండా ఎలా మింగించాలో శిక్షణలో సూచించారు. ఫైలేరియా నివారణే లక్ష్యంగా పనిచేయాలని తెలియజేశారు. అదేవిధంగా గురువారం ప్రపంచ నిర్లక్ష్య ట్రాపికల్ వ్యాధుల దినోత్సవం సందర్భంగా నిర్వహించే కార్యక్రమంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారిణి వై.మణి, ప్రోగ్రాం అధికారి వినోద్, వైద్యాధికారిణి క్రాంతి కిరణ్మయి, సిబ్బంది, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయం పట్ల రైతులు దృష్టిసారించాలి



మాట్లాడుతున్న జిల్లా వనరులకేంద్రం ఎ.డి శ్రీనివాసరావు

సీతానగరం: జిల్లాలోని రైతులు ప్రకృతి వ్యవసాయ విధానంపై దృష్టి సారించాలని జిల్లా వనరులకేంద్రం ఎ.డి కె.శ్రీనివాసరావు అన్నారు. ఈ మేరకు మండలంలోని తామరఖండిలో పామాయిల్, జీడి మామిడి రైతులకు మండల ఉద్యానశాఖ ఉద్యాన శాఖ అధికారి ప్రత్యూష అధ్యక్షతన శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పామాయిల్ తోటల పెంపకం, జీడి,మామిడి తోటల పెంపకం విస్తీర్ణం పెరగడం వల్ల రైతులు ఆర్థికంగా బలపడడానికి, అధిక దిగుబడులు సాధించడానికి అవసరమైన మెలకువలు పాటించాలని కోరారు. అందుకు స్థానికంగా ఇస్తున్న శిక్షణ కార్యక్రమాలను వినియోగించు కోవాలని కోరారు. మండల ఉద్యానశాఖ అధికారిణి ప్రత్యూష మాట్లాడుతూ పామాయిల్ తోటల్లో మెగ్నీషియం, బోరాన్ లోపాలు ఎక్కువగా ఉంటాయన్నారు. వాటి నివారణకు నత్రజని 400 గ్రాములు, ఫాస్పరస్ 200 గ్రాములు, పొటాషియం 400 గ్రాములు ఒక మొక్కకు ఒకసంవత్సరానికి మూడు దఫాలుగా వేసు కోవాలని సూచించారు. అదే విధంగా రైనోసిరస్‌బిటిల్ ఆకులు వి ఆకారంలో తినేస్తాయని వాటి నివారణకు ఫెమూన్ ట్రాప్స్ ఎకరాకు 4వ వంతు పెట్టాలని సూచించారు. మండల ఏఓ ఎస్ అవినాష్ మాట్లాడుతూ లెమన్ గ్రాస్ పంటగురించి తెలియజేశారు. ఒక పర్యాయం మొక్క వేసుకుంటే 3 నెలలకో పర్యాయం దిగుబడి వస్తుందని చెప్పారు. కార్యక్రమంలో వివిధ గ్రామాల రైతులు, వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

విద్యాసంస్థల్లో రాజకీయ జోక్యం వద్దు



పాఠశాల వద్ద నిరసన తెలుపుతున్న వామపక్ష నాయకులు

పార్వతీపురం టౌన్: విద్యాసంస్థల్లో రాజకీయ జోక్యం మానుకోవాలని సీపీఎం రాష్ట్ర నాయకుడు ఎం.కృష్ణమూర్తి డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం పార్వతీపురంలోని కొత్తవలసలోని పురపాలక ప్రాథమిక పాఠశాల వద్ద విద్యార్థులతో కలిసి పాఠశాల ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులు పాఠశాల విద్యా కమిటీ వద్దంటున్నప్పటికీ ఎమ్మెల్యే ఒత్తిడికి లొంగి డీఈఓ వంటలమ్మలను తొలగించడం అన్యాయమని, వారి వెనుక రాజకీయ నాయకుల ఒత్తిడే కారణమని, వెంటనే వాటిని మార్చుకోవాలని డిమాండ్ చేశారు. ప్రాథమిక పాఠశాలలో 94 మంది విద్యార్థులు ఉంటున్నారని, వారికి శుచి, రుచికి అనుగుణంగా ఆరోగ్యవంతమైన మధ్యాహ్న భోజనాన్ని అందిస్తున్నారని, స్వయంగా తల్లిదండ్రుల కమిటీ, ఉపాధ్యాయులందరూ కూడా గత కమిటీ సమావేశంలో అభినందించుకున్నట్లు మినిట్స్‌లో కూడా పొందుపరిచారన్నారు. నేడు రాజకీయ నాయకులు వాటికి భిన్నంగా విద్యార్థులకు అంత బాగా భోజనం వండడం చూసి సహించలేక వారికి అనుకూలమైన వారిని నియమించాలని విద్యాశాఖలో డీఈఓ నుంచి కిందనున్న ఉపాధ్యాయుల వరకు ఒత్తిడి తీసుకురావడం సరైన చర్య కాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు డి.రమణారావు, వై.మన్మథరావు, సీఐటీయూ జిల్లా కోశాధికారి గొర్లి.వెంకటరమణ, విద్యార్థులు వారి తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ వ్యవస్థపై నిర్లక్ష్యం



విద్యుత్ సరఫరా లేకపోవడంతో నిరుపయోగంగా రైతుభరోసా కేంద్రం

సాలూరు రూరల్: ఎంతో ప్రతిష్టాత్మకంగా గత ప్రభుత్వం సచివాలయ వ్యవస్థను ప్రారంభించి అందులో భాగంగా రైతు భరోసా కేంద్రాలు, హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్లను ప్రతి పంచాయతీలో ఏర్పాటు చేసి గ్రామీణ ప్రజలకు ప్రభుత్వ సేవలు ఇంటి ముంగిటకు అందుబాటులో తెచ్చింది. అయితే ప్రస్తుతం కూటమి ప్రభుత్వ ఏర్పాటైన నాటినుంచి సచివాలయ వ్యవస్థపై నిర్లక్ష్యంగా ఉంటోందనే విమర్శలు ఉన్నాయి. అందులో భాగంగానే ప్రతిరోజు ప్రజాసేవకోసం నియమించిన వలంటీర్లను తొలగించి సచివాలయ సేవలను ప్రజలకు చాలావరకు దూరం చేశారన్న ఆరోపణలు బలంగా ఉన్నాయి. కొత్తవలస పంచాయతీ గత ప్రభుత్వం సచివాలయం నిర్మాణంతో పాటు రైతు భరోసా కేంద్రం, హెల్త్ అండ్ వెల్ నెస్ సెంటర్లను ఏర్పాటు చేసింది. వెల్‌నెస్ సెంటర్ భవన నిర్మాణం జరిగింది.ఇంకా గచ్చులు వేయాల్సి ఉంది. అలాగే రైతు భరోసా కేంద్రం ప్రారంభించినా విద్యుత్ సరఫరా ఏర్పాటు కాలేదు. ఎన్నికలు సమీపించడంతో పనులు నిచిపోయాయి. అయితే ప్రస్తుత ప్రభుత్వం గత గతప్రభుత్వంలో నిలిచిన పనులను కనీసం పూర్తిచేయాలన్న ఆలోచన చేయడం లేదనడానికి కొత్తవలస రైతుభరోసా కేంద్రానికి విద్యుత్ సరఫరా ఇంత వరకు ఏర్పాటుచేయకపోవడమే ఒక ఉదాహరణగా చెప్పవచ్చు. రైతు భరోసా కేంద్రానికి విద్యుత్ సరఫరా లేకపోవడంతో ఆ కేంద్రంలో ఉండి విధులు నిర్వహించాల్సిన సిబ్బంది సచివాలయంలో ఉంటున్నారు. గత ప్రభుత్వంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన సచివాలయ వ్యవస్థతో గ్రామీణ ప్రజలకు మంచి సేవలు అందేవని ప్రసుతం అలాంటి పరిస్థితులు లేవని పలు గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ప్రజా ప్రయోజనాలకు అనుగుణంగా పరిపాలన సాగించాలని పలువురు కోరుతున్నారు.

‘కూటమి’ మోసం బట్టబయలు

- సూపర్ సిక్స్ లేనట్లే..
- ఎమ్మెల్సీ విక్రాంత్, మాజీ ఎమ్మెల్యే కళావతి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ విక్రాంత్, మాజీ ఎమ్మెల్యే కళావతి, తదితరులు

పాలకొండ:

కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీల అమలుపై చేస్తున్న మోసం బట్టబయలైందని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి అన్నారు. పాలకొండలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ...ఎన్నికల హామీలను నెరవేర్చలేమంటూ ముఖ్యమంత్రి హోదాలో చంద్రబాబు చెబుతుండడం సిగ్గుచేటన్నారు. హామీలు అమలు చేయమంటే.. సంపద సృష్టి అంటూ ప్రజలను మభ్య పెడుతున్నారంటూ మండిపడ్డారు. తొమ్మిది నెలల పాలనలో చేసిన 1.19 లక్షల కోట్ల రూపాయలు అప్పుతో ఏం అభివృద్ధి చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగ యువతకు 20 లక్షల ఉద్యోగాలు ఇస్తామని, నిరుద్యోగులకు నెలకు మూడు వేల రూపాయల భృతి అందిస్తామని చెప్పిన హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు.

ఉద్యోగాల మాట పక్కన పెడితే ఉన్న ఉద్యోగులను తొలగించడం నిజం కాదా అన్నారు. పాఠశాలకు వెళ్లే ప్రతి విద్యార్థికీ ఏడాదికి రూ. 15 వేలు.. రైతులకు రూ. 20 వేలు.. ఆడపిల్లలకు నెలకు రూ. 1500 ఎప్పుడు ఇస్తారని ప్రశ్నించారు. పవన్ కళ్యాణ్‌తో రెండు సినిమాలు తీస్తే వారికి వందల ఎకరాలు దోచిపెట్టడం ఎంతవరకు సమంజసమన్నారు. వైద్య విద్య కోసం అప్పటి ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి మెడికల్ కళాశాలల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటే.. వానిని వారి అనుయాయులకు కట్టబెట్టేందుకు ప్రయత్నిస్తున్న చంద్రబాబు నైజం ప్రజలకు అర్థమవుతోందన్నారు. ఇప్పటికైనా చంద్రబాబు అండ్ కో సూపర్ సిక్స్ హామీలను అమలు చేయాలని, లేనిపక్షంలో ప్రజల తరఫున పోరాటం తప్పదని స్పష్టం చేశారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కనపాక సూర్యప్రకాష్‌రావు, పాలవలస ధవళేశ్వరరావు, లోలుగు విశ్వేశ్వరరావు, తదితరులు ఉన్నారు.